

గాలి, వాన బీభత్సం... నేలపాలైన మామిడి

విశాలాంధ్ర-కే.కోటపాడు : గత రెండు రోజుల నుండి కురిసిన వర్షాలకు ప్రజలు ఉక్కపోత నుండి ఉపశమనం పొందినా... వరి, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉరుములతో కూడిన మెరుపులు బలమైన ఈదురు గాలులతో అనేక చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. మంగళవారం రాత్రి కురిసిన గాలివానకు మండలంలోని పెంద్రంగి లంకవానిపాలెం కురువాడ డి అగ్రహారం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. చౌడువాడ పైడం పేట పాచిలవానిపాలెం మల్లం పాలెం గ్రామాల్లో దాల్వా వరి పండించే రైతులు ఇబ్బందులు పడ్డారు. వరి పంట కోతకు వచ్చే సమయంలో గాలివానకు కొంత నీట మునిగినట్లు రైతులు చెప్తున్నారు. అలాగే మెట్ట ప్రాంతాలైన సూది వలస మర్రివలస శృంగవరం గొట్లాం గ్రామాల్లో వందలాది ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ సంవత్సరం పూత లేక దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. అక్కడక్కడ మామిడి తోటలకు ఉన్న కాయలు సైతం ఈ గాలులకు నేల మట్టమయ్యాయి. ఈ వర్షం సరుగుడు యూకలిప్టస్ తోటల కు మాత్రమే ఉపయోగమని రైతులు చెబుతున్నారు. మరో మూడు రోజులు ఇలాగే ఉండే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు.

సమస్యల పరిష్కారానికి వెంటనే 1100 నంబర్‌కు ఫోన్ చేయండి

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : మీ ఫిర్యాదులు నమోదు. చేయాలనుకుంటున్నా, లేదా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవాలనుకుంటున్నా తక్షణమే 1100 నంబర్‌కు ఫోన్ చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజలు తమ సమస్యలను తెలియజేసుకొనుటకు, పెండింగ్ అర్జీల పరిస్థితి తెలుసుకొనుటకు రాష్ట్ర ప్రభుత్వం కాల్ సెంటర్ నెంబర్ ఏర్పాటు చేయడమైనదని, కాల్ సెంటర్ నెంబర్ 1100 ఫోన్ చేసి ప్రజలు వారి సమస్యలను నమోదు చేయవచ్చునని మరియు పెండింగ్ ఫిర్యాదుల స్థితి త్వరగా తెలుసుకోవచ్చునని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పౌరునికీ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని, మీ సమస్యలకు పరిష్కారం కావాలంటే వెంటనే 1100 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని, అర్జీదారులు వారి అర్జీ పరిష్కారం కాకున్నా, అర్జీ సంబంధిత వివరములు తెలియకున్న 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదుదారులు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

సింహాచలం దేవస్థానం దుర్ఘటన బాధాకరం

విశాలాంధ్ర-అనకాపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం దేవస్థానంలో గోడ కూలి భక్తులు మరణించిన సంఘటన అత్యంత బాధాకరం అని బిఎస్‌పి, సిపిఐ ప్రజా సంఘాల నేతలు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్చార్జ్ సూది కొండ మాణిక్యాలరావు, సిపిఐ నాయకులు కోరిబిల్లి శంకరరావు, మత్తుర్తి సూరిబాబు, ఎమ్మార్పీఎస్ నేత కట్టమూరి మంగరాజు, ప్రజాసంఘ నేత ఆచారి తదితరులు మాట్లాడుతూ. సింహాచలం దేవస్థానంలో దుర్ఘటన జరిగి పలువురు భక్తులు మరణించడం అత్యంత ఆవేదన కలిగించిందని విచారం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉండవలసిన దేవస్థానాలు పర్యాటక ప్రదేశాలుగా మారుస్తూ కేవలం ఆదాయం మీద మాత్రమే దృష్టి సారిస్తూ భక్తులకు కల్పించవలసిన కనీస సదుపాయాలు గాని వారి రక్షణకు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు కూడా పాలకవర్గం గానీ అధికారులు గానీ తీసుకోకపోవడం వలన ఇటువంటి సంఘటనలు తరచుగా సంభవిస్తున్నాయని అన్నారు. ఇటువంటి సంఘటనలు భక్తుల మనోభావాల మీద తీవ్రమైన ప్రభావం చూపించే అవకాశం ఉన్నందున పాలకులు అధికారులు ఇటువంటి సంఘటనలను భవిష్యత్తులో జరగకుండా ఇకనైనా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దుర్ఘటనలో మృతి చెందిన భక్తులకు నష్టపరిహారం చెల్లించి గాయపడిన వారికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

టి.సిరసపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-మునగపాక : ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు కోరారు. యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్‌కుమార్ ఆదేశాలతో మండలంలో టి. సిరసపల్లి గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా వలస కూలీలను నివారించవచ్చన్నారు. రహదారులు, చెరువులు,కాలువలు వంటి అభివృద్ధికి ఈపథకం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్,గ్రామ సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, పంచాయితీ వార్డు మెంబర్ పోలమరశెట్టి నవీన్, పోలమరశెట్టి రూప వీర గణేష్, రంగాల శ్రీనివాసరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు పోలమరశెట్టి మురళీకృష్ణ, కొయ్య శేషువీరభద్రరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి

విశాలాంధ్ర-పాయకరావుపేట : శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆలయం వద్ద ప్రమాదం జరగటం అత్యంత బాధాకరమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి అన్నారు. ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినప్పటికీ భారీ వర్షానికి భక్తులు ప్రాణాలు కోల్పోవడం, మరి కొంతమందికి గాయాలు అవ్వడం అత్యంత దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతులకు రూ. 25 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం, గాయపడిన వారికి రూ. 3 లక్షలు అందించేందుకు ప్రభుత్వం తరపున హెూం మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని గెడ్డం బుజ్జి తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బుధవారం నిర్వహించిన పాలీసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పాలీసెట్ జిల్లా సమన్వయకర్త ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షకు 9049 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 8512 (94%) మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో బాలురు 4974 (95.3%) బాలికలు 3538 (92.5%) హాజరయ్యారు. అనకాపల్లిలో ఏర్పాటు చేసిన 14 సెంటర్లలో మొత్తం 6216 (94.33%) మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 3602 (95.6%) బాలురు, 2614 (92.7%) మంది బాలికలు ఉన్నారు. నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన 09 సెంటర్లలో మొత్తం 2296 (93.3%) మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 1372 (94.4%) మంది బాలురు, 924 (91.8%) మంది బాలికలు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా జరిగిన పాలీసెట్ పరీక్షకు హాజరయ్యేందుకు ఉదయము నుంచే విద్యార్థులు పరీక్షా సెంటర్లవద్ద బారులుతీరారని, విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, ప్రథమ చికిత్స కిట్‌లను అన్ని సెంటర్లలో ఏర్పాటు చేయడము జరిగిందని. జిల్లావ్యాప్తంగా 23 సెంటర్లలో పాలీసెట్-పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

మేడపై నుంచి జారిపడి సిఐఎస్ఎఫ్ జవాన్ పూసర్ల కృష్ణ మృతి

విశాలాంధ్ర-మునగపాక : మండలంలో మల్లవరం పంచాయతీ అప్పికొండవానిపాలెం గ్రామానికి చెందిన పూసల కృష్ణ(36) అనే సిఐఎస్ఎఫ్ జవాన్ ప్రమాదవశాత్తు మేడపై నుంచి కాలుజారి కిందపడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది.దీనికి సంబంధించి గ్రామస్తులు అందించిన వివరాలిలా ఉన్నాయి.పూసల కృష్ణ మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో తన నివాసంపై గల మేడపైకి వెళ్లి మేడపైన గల పిట్టగోడపై కూర్చొని సెల్ ఫోన్ లో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కాలుజారి మేడపై నుంచి కింద పడిపోయాడు.దీంతో కృష్ణను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.దీంతో కృష్ణ ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.కృష్ణ జమ్మూ కాశ్మీర్ శ్రీనగర్ సిఐఎస్ఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవలె సెలవుపై సొంత ఊరు వచ్చారు. మృతుడు కృష్ణకు భార్య,ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కృష్ణ అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కృష్ణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈమేరకు మునగపాక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుండే ఏ.టీ.ఎం.ల బాదుడు

విశాలాంధ్ర-చోడవరం : ఏ.టీ.ఎం. లావాదేవీల ఛార్జీల రుసుములను పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపిన దరిమిల మే 1 నుండి వాటిని అమలు చేసేందుకు బ్యాంక్ వర్గాలు సమాయిత్త మవుతున్నాయి. ఏ.టి.ఎం. నెలవారి ఉచిత పరిమితి దాటితే ప్ర తీ లావా దేవీ కు రూ. 23లు ఛార్జీ చేయనున్నారు. బాలన్స్ చెకింగ్ కు ఇప్పుడున్న రూ. 6 కు బదులు రూ. 7లు వసూలు చేస్తారు. వినియోగదారులు తమ బ్యాంక్ కు చెందిన ఏ.టి.ఎం లో 5 సార్లు, ఇతర బ్యాంక్ ల్లో 3 సార్లు మాత్రమే ఉచిత లావాదేవీలు జరుపుకోవాలి.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-పాయకరావుపేట : మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన కాకర జగన్నాథంకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్, ఇరిగేషన్, రోడ్ల సమస్యల గురించి గ్రామ రైతులతో చర్చించారు. ఈకార్యక్రమంలో కంకిపాటి వెంకటేశ్వరావు, బొంది కాశీ విశ్వనాథ్, చింతకాయల రాంబాబు, కీర్తి సీతారాం, వద్దాది వాసు, సిద్దిరెడ్డి నాగేశ్వరావు, వేముల పూడి అప్పారావు, దువ్వ శ్రీనివాస్, కూలి నానాజీ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల డిమాండ్లను పరిష్కరించాలి

విశాలాంధ్ర-అనకాపల్లి : గ్రామ రెవెన్యూ సహాయకుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ వ్యవస్థలో 19,350 గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న వీఆర్ఏలకు వీఆర్వోగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఏళ్ల తరబడి నామినేల్గా పనిచేస్తున్న వారిని విఆర్ఏలుగా నియ మించాలని అటెండర్ నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుండి 70% పెంచాలని అన్నారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

మైహోమ్ ఖాతాలో మరొక అత్యున్నత పుర్సస్కారం

విశాలాంధ్ర-యలమంచిలి : మండలంలోని ములకలాపల్లి గ్రామం నందు గల మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ) ఆధ్వర్యంలో ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ అను అంశంపై బ్రిటీష్ సేఫ్టీ కౌన్సిల్ వారు ఈ నెల 07వ తేదీ నుండి 09వ తేదీ వరకు నిర్వహించిన ఆడిట్ నందు 5 స్టార్ రేటింగ్ ఇవ్వడం జరిగినదని ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ (అపరేషన్స్) బి. రామస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఇండియాలోనే సిమెంట్ పరిశ్రమలలో బ్రిటీష్ సేఫ్టీ కౌన్సిల్ వారు నిర్వహించిన సర్వేలలో బ్రిటీష్ సేఫ్టీ కౌన్సిల్ వారి నుండి ఇలాంటి అత్యున్నత పుర్సస్కారాన్ని అందుకోవడం చాలా గర్వంగా ఉందని అన్నారు. ఈ పరిశ్రమ గతంలో కూడా ఎన్నో అవార్డులను అందుకోవడం జరిగినదని, ముందుముందు ఇంకా ఎక్కువ కృషితో మరిన్ని అవార్డులు అందుకోవడానికి కృషి చేస్తామని తెలిపారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీపై రూ.70వేలు జరిమానా : ఎస్సై

విశాలాంధ్ర-మునగపాక: అనకాపల్లి-అచ్చుతాపురం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళుతున్న భారీ వాహనాన్ని గుర్తించి రూ.70 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.పూడిమడక రోడ్లో ఎటువంటి అనుమతులు లేకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే చర్యలు తప్పవని ఎస్సై పి.ప్రసాదరావు హెచ్చరించారు.

బాలికలకు భరోసా 'కిషోర వికాశం'

ఐ.సి.డి.ఎస్. పి.ఓ. ఎస్.పుష్పదేవి

విశాలాంధ్ర-చోడవరం : వేసవిలో బాలికలకు భరోసా కల్పించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో వివిధ శాఖలతో 'కిశోర వికాశం' ఏర్పాటు చేయనున్నట్లు రావికమతం ఐసిడిఎస్ సి.డి.పి.ఓ ఎస్. పుష్ప దేవి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం కిశోర వికాసం పై వివిధ శాఖలతో సమావేశం నిర్వహించారు. అంగన్వాడి, మహిళా పోలీస్, ఎం.ఎల్.హెచ్.పి, ఆశ, వెలుగు విఓ లతో గ్రామస్థాయిలో గ్రూపులు ఏర్పాటు చేసి, మే 2 నుండి జూన్ 10 వరకు 11-18 సంవత్సరాలు వయస్సు గల కిశోర బాలికలకు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కిషోర బాలికలకు భరోసా కల్పించేందుకు సూచనలు, అవగాహన చర్యలు తీసుకుంటా మన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు ఎస్.అనిత, డి.శ్రీదేవి, ఐ.సి.పి.ఎస్ నుండి లక్ష్మీ, వెలుగు ఏపిఎం తిలక్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు విఓలు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్, ఇసుక మాఫియాపై అధికారుల పంజా

- విశాలాంధ్ర వార్తపై స్పందించిన యంత్రాంగం
- అక్రమార్కులకు అడ్డుకట్ట వేస్తున్న రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం మండలంలో పెట్రేగిపోతున్న మైనింగ్, ఇసుక మాఫియా లపై రెవెన్యూ అధికారులు పంజా విసిరారు. మండలంలోని రాయిపురాజపేట రెవెన్యూ పరిధిలోగల నరసాపురం గ్రామంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలను అదుపు చేసేందుకు మండల తహసిల్దార్ రామారావు ఆధ్వర్యంలో బుధవారం ట్రెంచ్ లు తవ్వించారు. విశాలాంధ్ర జాతీయ తెలుగు దిన పత్రికలో ఈ నెల 19న ప్రచురితమైన " బరి తెగిస్తున్న గ్రావెల్, ఇసుక మాఫియా"పై రెవెన్యూ అధికారులతో ఆయా గ్రామాల్లో నిఘా ఉంచామన్నారు. ఈ నెల 29న ప్రచురితమైన "కొండలను మింగుతున్న అధికార పార్టీ అనకొండలు" అన్న వార్తకు స్పందించిన తహసిల్దార్ బాధిత ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తక్షణమే మైనింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు నరసాపురం గ్రామంలో గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుపకుండ ఉండేందుకు జెసిబి తో ట్రెంచ్ లు తవ్వించామన్నారు. కే జి ఎఫ్ సినిమా తరహాలో కొండలను పిండి చేసి గ్రావెల్ తరలిస్తున్న గ్రామాల్లో భారీ గుంతలు ఏర్పడటం గమనించమన్నారు. మండలంలో మైనింగ్ ఇసుక మాఫియా, వారి వలన జరుగుతున్న సామాజిక ఆర్థిక నష్టాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అక్రమ గ్రావెల్, ఇసుక వ్యాపారులపై ఉన్నతాధికారుల అదేశాలతో తదుపరి చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో డి.టి. సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో త్రాగునీటికి అధిక ప్రాధాన్యత

ఏ ఎల్ పురం సర్పంచ్ 'లోచల సుజాత'

విశాలాంధ్ర-గొలుగొండ : మండలంలో మేజర్ పంచాయతీ ఎఎల్ పురం గ్రామంలో వేసవి దృశ్య మంచినీటి సమస్యపై అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని సర్పంచ్ లోచల సుజాత తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో సర్పంచ్ సుజాత మాట్లాడుతూ ఏ ఎల్ పురం గ్రామంలో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు ఏడు మంచినీటి ట్యాంకులు ఉన్నాయని అందులో మూడు ట్యాంకులకు సమీపంలో గల లింగంపేట నుండి వచ్చే వాటర్ స్కీం ద్వారా పనిచేస్తున్నాయన్నారు అయితే అవి తరచు మరమత్తులకు గురి కావడంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయంగా మిగిలిన నాలుగు వాటర్ ట్యాంకులు సక్రమంగా పనిచేస్తున్నాయని వాటిలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే విను వెంటనే మరమ్మత్తులు చేపిస్తున్నామని తెలిపారు అలాగే అవసరమైతే కొత్త మోటర్లు బిగించుచున్నామని గతంలో జేజేఎం ద్వారా పైప్ లైన్స్ టాప్స్ బిగించాలని కానీ వాటికి కొన్నిచోట్ల కలెక్షన్ ఇవ్వలేదని వాటిని కూడా ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ సుజాత తెలియజేశారు.

ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించిన వైస్ఎంపీపీ

విశాలాంధ్ర-యస్ .రాయవరం : మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులు ప్రారంభించారు .మండల పరిషత్ అభివృద్ధినిధుల నుంచి 5 లక్షల రూపాయల మంజూరు చేయడంతో స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం చేయడం జరుగుతుందని వైస్ ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్ కుమార్, ఎస్. రాయవరం ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, గ్రామ నాయకులు బండి నాగేశ్వరరావు, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరకు పార్లమెంట్ పరిశీలకుడిగా బొడ్డేడ ప్రసాద్ నియామకం

విశాలాంధ్ర-మునగపాక : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలికుడుగా బొడ్డేడ ప్రసాద్ నియామకం అయ్యారు.పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.ప్రస్తుతం బొడ్డేడ ప్రసాద్ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయనకు వైసీపీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

పద్మ అవార్డుల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-అనకాపల్లి : మినిస్ట్రీ ఆఫ్ హెూమ్ ఎఫైర్స్, భారత ప్రభుత్వం వారు, జనవరి 26, 2026 భారత రిపబ్లిక్ డే దినోత్సవ సందర్భమున పద్మ అవార్డుల పురస్కారము కొరకు వివిద రంగాలలో ఆర్ట్, సోషల్ వర్కు, పబ్లిక్ ఎఫైర్స్, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీసు, స్పోర్ట్సు మొదలగు రంగాలలో అత్యున్నత కృషి, సేవలను అందించిన విశిష్ట ప్రతిభావంతుల నుండి నామినేషన్‌లు/ దరఖాస్తులను ఆహ్వానించుచున్నారు. దరఖాస్తు చేసుకొనగోరువారు "ఆన్ లైన్" పద్ధతిన మాత్రమే నిర్ణీత నమూనాలో, వెబ్ సైట్‌లో తెలిపిన ప్రాప్తికి, ఆయా రంగాలలో చేసిన సేవలను ఆదారిత డాక్యుమెంటేషన్‌తో, పొందుపరుస్తూ నామినేషన్‌లు/ దరఖాస్తులు సమర్పించు కొనవలెను. ఆయా రంగాలలో, అత్యున్నత కృషి స్వచ్ఛందంగా విశేష సేవలు అందించి జాతీయ, రాష్ట్రీయ అవార్డులు పొందిన, విశాఖపట్నం జిల్లా యువత వెబ్ సైట్: https://awards.gov.in ప్రతిపాదనలను (ఆన్లైన్‌లో చేసిన దరఖాస్తు) ఒక కాపీ జిరాక్స్, సాఫ్ట్ కాపీ ఈ కార్యాలయమునకు 10.06.2025లోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి/ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి, సెట్విస్ కార్యాలయము, మహారాణిపేట, విశాఖపట్నం వార్కి సమర్పించవలెను. యువజన భవన్, ఇతర వివరములకు కార్యాలయము పనివేళల్లో ముఖ్యకార్యనిర్వాహణ అధికారి, సెట్విస్ / జిల్లా యువజన సంక్షేమ వారి కార్యాలయము, యువజన భవన్, మహారాణిపేట, విశాఖపట్నం నందు సంప్రదించవలసిందిగా జిల్లా కలెక్టర్ తెలియజేసారు.

రక్తధాన దాతకు సేవారత్న అవార్డు

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని రక్తదాన దాతకు సేవారత్న అవార్డు లభించినట్లు తాసుబిల్లి ఫౌండేషన్ సభ్యులు పొట్నూరు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్మిక దినోత్సవ వేడుకలు సందర్భంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో మమతా స్వచ్ఛంద సేవా సంస్థ పలువురు సమాజ సేవకులను గుర్తించి ఉద్యమకారుడు మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతి రావు పేరట నీతి పూడి సేవ రత్న అవార్డులను ప్రధానం చేసారన్నారు. ఈ అవార్డు పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డీ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ, రాజమండ్రి ఎస్పీ / కమాండెంట్ /ఎపిఎస్‌పిఎఫ్ కొండా నరసింహారావు పలువురు ప్రముఖుల చేతులు మీదగా అవార్డు అందుకోవడం జరిగిందన్నారు. తాను చేసే రక్తదాన సేవా కార్యక్రమాలు, ఇతర స్వచ్ఛంద సేవ కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ అవార్డు ప్రధానం చేసిన మమతా స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు కారుకొండ జానుకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అలాగే తన సేవలను గుర్తించి ముందుకు నడిపిస్తున్నటువంటి తాసుబెల్లి ఫౌండేషన్ చైర్మన్ శంకర్ నాయుడు కు మరియు ట్రస్టీ వెంకటలక్ష్మికు, తాసుబెల్లి ఫౌండేషన్‌కు పరిచయం చేసిన జెట్టి గణేష్‌కు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు తనకు కు ఎంతగానో సహకరించిన తమ గ్రామ యువకులకు, చుట్టుపక్క గ్రామ యువకులకు, స్నేహితులకు బంధువులకు మిత్రులకుఅందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనను ఎంతోగానో ప్రోత్సహించే అమ్మ,నాన్నలకి మరియు తన భార్యకి ఈ అవార్డుని అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది .బుధవారం ఉదయం నుంచి ఎండ విపరీతంగా కాయడం సాయంత్రం ఆకాశంలో ఒకసారిగా దట్టమైన మేఘాలు వెలుతూ విపరీతమైన గాలితో వర్షం ప్రారంభమైంది. సుమారు గంటన్నర పైగా ఎడతెరిపిలేని వర్షం పడడంతో ఎస్ .రాయవరం ధర్మవరం అడ్డు రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్డుపై నీరు ప్రవహించింది. ఇటీవల కాలంలో ఎప్పుడు లేని విధంగా ఇంత భారీ వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాయకరావుపేట : మండలంలోని పాల్తేరు గ్రామంలో చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామంలోని 4వ వార్డులో కోలా వారి వీధిలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డు మొత్తం మునిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నప్పటికీ పంచాయితీ పాలకవర్గం కానీ, అధికారులు కానీ పట్టించుకోవడంలేదని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిసినప్పుడల్లా రోడ్డు మునిగిపోయి, రోడ్డు ఎక్కడుందో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారని ప్రజలు చెప్తున్నారు.

కురిసిన వర్షంతో పాటు, కాలవల్లో ఉన్న మురికి నీరంతా రోడ్డు పైకి వచ్చి తీవ్ర దుర్వాసన వస్తున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం, అధికారులు చర్య తీసుకుని వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని బుధవారం కురిసిన భారీ వర్షానికి

మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.సబ్బవరం మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో భారీ వర్షం కారణంగా సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్,పాత సబ్బవరం జంక్షన్, ఆర్ టి సి కాంప్లెక్స్,పోలీస్ స్టేషన్ లు వర్షం నీటికి ముంపునకు గురయ్యాయి. దీనితో ఆయా కార్యాలయాల సిబ్బంది, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లోతట్టు ప్రాంతాల లో వర్షం నీరు నిల్వ లేకుండా ఉండడానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. చిన్నచిన్న అకాల వర్షాలకే లోతట్టు ప్రాంతాలు వర్షం నేటితో మునిగిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే రానున్న వర్షాకాలంలో మరింత ఇబ్బందులు అయ్యే అవకాశాలు ఉన్నాయని, తక్షణమే సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు, మేధావులు కోరుతున్నారు.

పెతకంశెట్టి రామజోగినాయుడు, నాగలక్ష్మి దంపతుల సహకారంతో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-మునగపాక : మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవాలయం పెదరామాలయం వద్ద పెతకంశెట్టి రామ జోగినాయుడు, నాగలక్ష్మి దంపతుల సహకారంతో బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా చలివేంద్రం పులిహోర పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మళ్ల కన్నమనాయుడు, మళ్ల శేషు, కొణతాల అప్పారావు, ఎల్లపు చిన్నారి మహిళలందరూ హాజరయ్యారు.

ఘనంగా అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-చీడికాడ : మండలంలోని తునివలస శివారు వింటిపాలెం గ్రామంలో అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గ్రామస్తులు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా ఎంపీపీ కూరచా జయమ్మ మండల వైస్సార్సీపీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు దేవరాపల్లి వైస్సార్సీపీ అధ్యక్షులు బూరె బాబురావు వైస్ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు గ్రామ సర్పంచ్ పడాల హైమ శ్రీను వైస్ ప్రెసిడెంట్ విస్సారపు జయలక్ష్మి నాగేశ్వరావు నారాయణరావు గ్రామస్తులు గ్రామపెద్దలు స్వామీ వారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్ద ప్రసాదాసలు స్వీకరించారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

గ్రంథాలయం అధికారి వి. శిరీష

విశాలాంధ్ర-సబ్బవరం: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పెంపొందుతుందని స్థానిక గ్రంథాలయం అధికారి వి. శిరీష అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు న్యూస్ పేపర్ చదవడం, మరియు సూర్య నమస్కారాలు,యోగ ఆసనాలు రిటైర్డ్ అధికారి రత్నకుమార్ చేయించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధికారి వి.శిరీష మాట్లాడుతూ యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పెంపొందుతుందని, ప్రతిరోజు పిల్లలు యోగ చేయడం వల్ల రోజంతా ఉత్సాహం, మేధాశక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈ శ్రీరామమూర్తికి ఘన సన్మానం

విశాలాంధ్ర-పాయకరావుపేట : ఇరిగేషన్ ఏఈగా పాయకరావుపేట మండలంలో ఉత్తమ సేవలు అందించి బదిలీ అయిన ఏఈ శ్రీరామమూర్తిని కాలువ సంఘాల చైర్మన్లు ఘనంగా సన్మానించారు. ఇరిగేషన్ డిఈ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చింతలపు రామారావు, చింతలపు ప్రదీప్, గూటూరు రామ గోవిందు, దేవవరపు రఘు, గణపర్తి నరసింహారావు, పి. గోవిందు, కోనే శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై అవగాహన

విశాలాంధ్ర-పాయకరావుపేట : వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా పాయకరావుపేట శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై అవగాహన కలిగించారు. అలాగే యోగ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వై. అచ్యుతరావు, గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువజన మందిరం ఆధ్వర్యంలో కళాకారులకు ఘన సత్కారం

విశాలాంధ్ర-మునగపాక: గ్రామీణ యువజన మందిరం ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల కళాకారులు పీసీహెచ్ నాయుడు (మీసాలనాయుడు),డి. శివాజీలను బుధవారం ఘనంగా సత్కరించారు.స్థానిక గ్రామీణ యువజన మందిరం వద్ద ప్రముఖ తెలుగు కవి రచయిత శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) జయంతి సందర్బంగా ప్రముఖ కందుకూరి వీరేశలింగం అవార్డు-2025 గ్రహీత మన ప్రాంతవాసి పీసీహెచ్ నాయుడు(మీసాల నాయుడు), రంగస్థల నటుడు శివాజీలను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందిరం గౌరవ అధ్యక్షులు సూరిశెట్టి రాము,పీ.వీ సీతారాం,నూతన గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్,కోశాధికారి ఆడారి లక్ష్మణరావు,కార్యదర్శి ఆడారి సూర్యచంద్రరావు,కాండ్రేగుల జగ్గారావు,టెక్కలి పరశురాం,శ్రీనివాస్,పెంటకోట వెంకట్,గ్రామీణ యువజన మందిర సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం పునఃనిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని ఆరిపాక పంచాయతీ, లగిశెట్టిపాలెం గ్రామంలో శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం పునః నిర్మాణానికి బుధవారం ఉదయం 7.16 నిమిషాలకు జిల్లా వైసిపి మాజీ యువజన విభాగం అధ్యక్షుడు పాలిసెట్టి సురేష్ రాజ్, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో వేదమంత్రాల సడుమ శంకుస్థాపస నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయ పునః నిర్మాణానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అమ్మవారి ఆలయంలు గ్రామానికి పొలిమేరల్లో ఉంటూ గ్రామాన్ని గ్రామంలోని ప్రజలు అందరూ ఆరోగ్యంతో సుభిక్షకంగా వుండేవిధంగా కాపాడుతారని తెలియజేస్తూ ఆ ఆలయం నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి ఆ అమ్మవారు ఆశీస్సులు మెండుగా ఇవ్వాలని కోరుకున్నారు. ఆయనతో పాటు అనకాపల్లి జిల్లా మాజీ వైస్సార్సీపీ యువజన విభాగం అధ్యక్షులు పాలిశెట్టి సురేష్ రాజ్, ఆరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతి ,స్థానిక వైస్సార్సీపీ నాయకులు బి. మహాలక్ష్మి నాయుడు, ఎన్ పి రాజు, బండారు రమణ, సర్పంచ్లు బి రామారావు, నేబర్తి శ్రీనివాసరావు, వైస్సార్సీపీ నాయకులు యడ్ల నాయుడు, ఐ డి బాబు ,సిరపరపు వాసు, గండి రవికుమార్ యువసైన్యం ఉన్నారు.

మాడుగుల మోదకొండమ్మ జాతరకు సన్నాహాలు

విశాలాంధ్ర-వి. మాడుగుల : జూన్ 3వ తేదీన జరిగే మాడుగుల మోదకొండమ్మ జాతరకు భారీ సన్నాహాలు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, గౌరవ కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలో భాగంగా మే 1వ తేదీ ఉదయం 7.45 నిమిషాలకు శతకం పట్టు వద్ద రాట ముహుర్తం, 4వ తేదీ రాత్రి 6.55 నిమిషాలకు అమ్మవారి పండుగ చాటింపు, 6వ తేదీ ఉదయం అమ్మవారి ప్రధాన ఆలయం నుండి ఊరేగింపుగా శతకం పట్టు వద్దకు అమ్మవారి ఘటాలతో పాదాలు 9.45 నిమిషాలకు కొలువు తీర్చే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. అమ్మవారి కొత్త ఉత్సవ కమిటీని మరో పది రోజుల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటిని గతంలో మాదిరిగానే యధావిధిగా లాటరీ పద్దతిలో కమిటీ వేస్తామన్నారు. ఈ ఏడాది నుండి అమ్మవారి పండుగకి సంబంధించి గ్రామంలోచందాల రూపంలోకూడా తీసుకుంటామని అన్నారు. అమ్మవారి పండుగ విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు.

నేటి నుంచి శ్రీగౌరీ గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-అనకాపల్లి : స్థానిక శ్రీ గౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు మే 1 ఉదయం 9 గంటల నుంచి జరగనున్నాయని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ గౌరీ గ్రంథాలయం వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు కంప్యూటర్ హాలులో జరగనున్న ఈ తరగతులు మే 30వ తేదీ వరకు జరుగుతాయి. సర్టిఫికేట్ ఇన్ కంప్యూటర్ కాన్సెప్ట్స్, ఎం.ఎస్-ఆఫీస్, ఎం.ఎస్.-వర్డ్, ఎం.ఎస్-ఎక్సెల్, ఎం.ఎస్.పవర్ పాయింట్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్ మొదలగు కోర్సులకు శిక్షణ ఇస్తామని ఆయన చెప్పారు. ప్రతి రోజు తీరీ, ప్రాక్టికల్స్ కూడా జరుగుతాయన్నారు. నామ మాత్రపు ఫీజు మాత్రం శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు చెల్లించాలన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారు శిక్షణకు హాజరు కావచ్చు. శిక్షణ అనంతరం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయుటకు అనుగుణమైన అర్హులకు సర్టిఫికేట్ జారీ చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు మొబైల్ నెంబర్లు 92471 87355, 92471 66511లను సంప్రదించాలని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తెలుసుకోవాలి

చైర్‌పర్సన్ రమాకుమారి

విశాలాంధ్ర-యలమంచిలి : వేసవిలో ప్రారంభం నుండి ఎండలు తీవ్రతరం ఉండడంతో మున్సిపాలిటీలో మంచినీటి ఎద్దడి లేకుండా ఏర్పాటు చేయాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమా కుమారి అధికారుల ఆదేశించారు. బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కాశ్మీర్ లో

ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి, నేడు సింహాచలంలో మరణించిన వారికి సంతాపం తెలిపి మౌనం పాటించారు. ఈ సందర్భంగా పిల్లా రమా కుమారి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో గల గ్రామాల్లోనూ పట్టణంలోనూ త్రాగినీటి సమస్యలు ఇప్పటిపరకు తలెత్తలేదని, ఈ ఏడాది ఎండలు తీవ్రతరం కావడంతో నేటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉండటం వల్ల ముందు జాగ్రత్తగా మంచినీటిపై సమాలోచన చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బాకూరి ప్రసాదరాజు 2025-26 బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అరెపు గుప్తా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ నెంబర్లు, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్, శానిటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

విశాలాంధ్ర-రాంబిల్లి : మండలంలో గల జనసేన నియోజకవర్గ కేంద్ర పార్టీ కార్యాలయంలో బుధవారం అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట, మల్లవరం, ఉప్పవరం, చెర్లోపాలెం గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు పిన్నమరాజు వాసు, సకల ఉమా మహేశ్వరి,చిన్ని శ్రీనివాసులతో పాటూ 200మంది వైకాపా కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను చేస్తున్న అభివృద్ధి పనులు చూసే వైకాపా నుంచి జనసేన పార్టీలోకి వస్తున్నారన్నారు.నాలుగు మండలాల అభివృద్ధికి కంకణం కట్టుకుని, పట్టుదలతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రజలంతా ఆయనకి సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాంబిల్లి జనసేన పార్టీ మండలాధ్యక్షులు పప్పల నూకన్న దొర,ఇంచార్జ్ బైలపూడి శ్రీ రామదాసు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు జనసపరెడ్డి శ్రీనివాసరావు,పార్టీ నాయకులు ద్వారపురెడ్డి బాబ్జీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవస్థానం అధికారులను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర-అనకాపల్లి : మహా పుణ్యక్షేత్రమైన విశాఖ జిల్లా సింహాచల దేవస్థానం ఆవరణలో గోడకూలి ఎనిమిది మంది భక్తులు మరణించడం, కొంతమంది క్షతగాత్రులు కావడం చాలా విచారకరమైన విషయం ఈ సంఘటనకు బాధ్యులైన స్పెషల్ ఆఫీసర్‌ను దేవస్థానం ఈవోని సస్పెండ్ చేసి పాలకమండలిని కూడా రద్దు చేయాలని ఆమ్ ఆద్మీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు డిమాండ్ చేశారు. మేరకు బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి దర్శనానికి వచ్చి తన భక్తిని చాటుకుందామనుకునే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు భక్తులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధను కలిగించింది సాధారణ భక్తులను బంధించి 300 రూపాయల టికెట్లపై ఎక్కువ దృష్టి పెట్టడం సింహాద్రి అప్పన్నకు బాధ కలిగించింది నా వద్దకు వచ్చే నా భక్తులందరూ నాకు సమానమే అన్న మాటను పక్కనపెట్టి పాలకవర్గానికి నచ్చినట్లుగా వ్యవహరించడం స్వామి ఆగ్రహానికి కారణమయ్యింది దేవాలయంలో మరణించిన వారికి నష్టపరిహారం చెల్లిస్తూ వారి కుటుంబ సభ్యులకు దేవాలయంలో ఉద్యోగ భద్రత కల్పించాలని కోటమి ప్రభుత్వాన్ని కోరారు. దేవాలయం పరిసర ప్రాంతాల్లో ఇంకా ఇటువంటి బలహీనంగా ఉన్న గోడలను గుర్తించి వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పాలకవర్గం వారు స్వామి దర్శన భాగ్యములో వీఐపీలకు ప్రముఖులకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం అలాగే సాధారణ భక్తులపై చిన్న చూపు చూడడం వంటి చర్యల పలస భక్తులలో అసమానత లు పెరిగి అసహనం పెరిగింది తీవ్ర నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు .దీంతో స్వామివారికి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని భావించవలసి వస్తుంది కావున ఈ విషయమై స్వామి సన్నిధిలో ఉన్న ఉద్యోగులందరూ బాధ్యతలు తీసుకొని ఆలయ పరిపాల నా విధానములో సమూలమైన మార్పులు తీసుకొని మరొక్కసారి ఇటువంటి సంఘటన లు పునరావతం కాకుండా తగు చర్యలు తీసుకురావాలని ఆయన కోరారు.

సీనియర్ ఉపాధ్యాయుడు కర్రి ధర్మారావుకు ఘన సత్కారం

విశాలాంధ్ర-యస్.రాయవరం : గుర్రాజుపేట ప్రధానోపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కర్రీ ధర్మారావు ఘనంగా సత్కరించారు. బుధవారం ఉద్యోగ విరమణ సందర్భంగా మండలంలో అడ్డరోడ్డు తిమ్మాపురంలో కళ్యాణ మండపంలోని ఏర్పాటు చేసిన సమావేశానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ.. ధర్మారావు మాస్టారు ఉద్యోగ విధులు నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సమస్యలపై పట్టుదలతో పోరాటాలు చేసిన ఘనత ఆయనకు ఉందని అన్నారు. ఆయన చేసిన సేపలసు ఎప్పుడూ గుర్తుంటాయని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ఏ పిలుపును ఇచ్చిన ముందుండి ఈ జిల్లాలో కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అటువంటి నాయకుడు పదవి విరమణ చేసిన సంఘముకు సహా సహకారం అందించాలని కోరారు. అనంతరము ఆయనను ఘనంగా ఉపాధ్యాయులు బంధువులు అభిమానులు విద్యార్థులు సన్మానించారు .ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, డిప్యూటీ డిఇఓ పెన్నాడ అప్పారావు ,ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు వెంకటపతి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం సర్పంచ్ కర్రీ సత్యనారాయణ, గ్రామ పెద్దలు పంగలపూడి గోవిందు, గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఎస్సై షేక్ రవీద్ భాషకు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర-అనకాపల్లి: జిల్లాలోని ఎలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న షేక్ రవీద్ భాష పదవీ విరమణ పొందిన సందర్భంగా, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తరపున ఘన సన్మానం నిర్వహించబడింది. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ వీడ్కోలు కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, సహచరులు పాల్గొని ఆయన చేసిన విశేష సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ మాట్లాడుతూ .38 సంవత్సరాల సుదీర్ఘ పోలీస్ సేవలో "షేక్ రవీద్ భాష చూపిన అంకితభావం, నిబద్ధత, పట్టుదల పోలీసు శాఖకు ఆదర్శంగా నిలిచాయి. ప్రజలకు సేవ చేయడంలో మీరు చూపిన తపన ప్రతి పోలీసు సిబ్బందికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. పదవీ విరమణ అనంతరం మీరు ఆరోగ్యంగా, కుటుంబంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటున్నాం. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఎస్సై షేక్ రవీద్ భాష మాట్లాడుతూ ఇంత ఘనంగా వీడ్కోలు పలకడం, సేవలను గుర్తించి సత్కరించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ సంఘటన నా జీవితంలో మరపురాని ఘట్టంగా నిలిచిపోతుంది," అని భావోద్వేగంతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఏవో శ్రీ ఏ.రామ కుమార్, సీఐలు లక్ష్మణమూర్తి, బెండి వెంకట్రావు, లక్ష్మీ , ఎస్సై లు వెంకన్న, సురేష్ బాబు, విశ్వనాథం, శేషగిరిరావు, పోలీసు అధికారులు, పదవీ విరమణ పొందిన ఎస్సై కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేజర్ పంచాయతీ మునగపాక గ్రామశాఖ అధ్యక్షుడిగా దాడి శివ

విశాలాంధ్ర-మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దాడి ముసలినాయుడు,నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట విజయ్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణ్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా దాడి శివ మరియు కార్యదర్శిగా కాండ్రేగుల భాగ్యరాజు, ఉపాధ్యక్షుడిగా టెక్కలి పరశురాం,ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సూరిశెట్టి శ్యామ్, భాస్కరరావు, బుద్ధ వెంకటి, పెన్నాడ సూర్యకళ, ఆడారి నాగమణి, రంగాల అనిల్, కోశాధికారిగా దాడి భీము నాయుడు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ సమావేశంలో మునగపాక తెలుగుదేశం పార్టీ నాయకులు విల్లూరి నర్సింగరావు, పెంటకోట శ్రీరామమూర్తి,ఆడారి లక్ష్మణరావు, సూరిశెట్టి అప్పలనాయుడు,దాడి అప్పలనాయుడు బొడ్డేడ ప్రసాద్, వెలగా మురళి, బీలా లక్ష్మణరావు,పూసర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవిపురంలో అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర- సబ్బవరం:అక్షయ తృతీయ సందర్భంగా మండలంలోని దేవీపురం లో మహాలక్ష్మీ అమ్మవారికి భక్తి శ్రద్ధ లతో అనేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు దేవిపురం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ తెలిపారు. అలాగే శ్రీ యంత్ర మహా మేరు ఈశాన్య భాగం లో కొలువై యున్న శ్రీ మహా లక్ష్మీ అమ్మవారికి ఉదయం నుండి హాజరైన భక్తుల సమక్షంలో సుగంధజల, క్షీర, పంచామృత అభిషేకాలు జరిపారు. తదనంతరం శ్రీ సూక్త విధానేన షోడశోపచార పూజ, అనంతరం ముగ్గురు అమ్మల ప్రాంగణం లో మహాలక్ష్మి సహస్ర నామావళి, సహిత కుంకుమార్చన జరిగాయి.సమాంతరంగా శ్రీ విద్యారణ్య సంపుటిత శ్రీ సూక్త శ్రీ మహా లక్ష్మీ హోమం జరిగాయి.సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి హాజరైన భక్తుల సమక్షం లో సంధ్యాహారతి జరిగింది. భక్తిశ్రద్ధలతో అందరూ పాల్గొని అమ్మవారి కటాక్షాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్య ట్రస్ట్ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి గోపురం బ్రహ్మ రంధ్రం మూసివేత

విశాలాంధ్ర-వి. మాడుగుల : మాడుగుల శ్రీదేవి ఆలయం గర్భగుడిపై నూతనంగా నిర్మిస్తున్న గోపురం బ్రహ్మరంధ్రం మూసివేత కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు నున్నవాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ బ్రహ్మ రంధ్రంలో నవధాన్యాలు, పంచలోహాలు, పగడం, ముత్యం, రాగికనీలు వంటివి ముహూర్తం ప్రకారం వేసి మూసివేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షులు శ్రీనాధు శ్రీనివాసరావు, అధ్యక్షులు ఎస్‌వి.కొండలరావు, సర్పంచ్ యడ్ల కళావతి, యడ్ల హేమంత్ కుమార్, గౌరీపట్టపు అచ్యుతం, మోటార్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-యలమంచిలి : యలమంచిలి శాఖా గ్రంథాలయం అద్వర్యంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం మే 06 తేదీ నుండి 40 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది విద్యార్థిని విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపు ని ఉపయోగించుకోవాలని గ్రంథాలయాధికారి వి ఆనంద్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించున్నాము రోజు కథలు, కధానాలు, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, పెయింటింగ్, డాన్స్, క్విజ్, జీ కే, యోగా, క్రాఫ్ట్, మొదలగు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు వై. అప్పారావు, పాఠకులు విద్యార్థిని, విద్యార్థులు, గ్రంథాల సిబ్బంది పాల్గొన్నారు.